క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల: మండలంలోని ఎలికట్టె, బోయగుబ్బ గ్రామాల్లో ఈ విద్యా సంవత్సరంలో ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చినట్లు చిట్యాల ఎంఈఓ పానుగోతు సైదానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో టీచర్, ఆయా పోస్టుల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ టీచర్‌కుగాను 18 నుంచి 44 ఏళ్ల వయస్సు ఉండి ఇంటర్‌తోపాటు డీఈడీ లేదా బీఈడీ కలిగి ఉన్నట్లయితే రూ.8 వేల వేతనం, ఆయా పోస్టుకుగాను 18 నుంచి 44 ఏళ్ల వయస్సు ఉండి ఏడో తరగతి పాస్ అయి ఉన్నట్లయితే రూ.6 వేల వేతనాన్ని పది నెలలపాటు ఇస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు చెందిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్య ఇస్తామన్నారు. తాత్కాలిక పద్ధతిలో జరిగే ఈ నియామకాలకు దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీలోపు అందజేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కనగల్: ధర్మ సమాజ్ పార్టీ మండల నూతన కమిటీని శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకర్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా దోరేపల్లి గ్రామానికి చెందిన దాసరి బాలరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా విజయ్, కార్యదర్శిగా సుధాకర్, కమిటీ సభ్యులుగా వెంకటేష్, దిలీప్, నాగయ్య, జానయ్య, నవీన్ లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి కళ్యాణ్ గౌడ్, ఉపాధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తురక కాశ సంఘం కమిటీ..



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

తిప్పర్తి : తురక కాశ సంఘం తిప్పర్తి మండల, గ్రామ కమిటీలను కాశివారిగూడెం గ్రామంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు ఎస్కే అబ్దుల్ రహీం అధ్యక్షతన ఎన్నుకున్నారు. కాశివారిగూడెం గ్రామ అధ్యక్షుడిగా ఎస్కే మౌలానా, ఉపాధ్యక్షుడిగా షేక్ అల్లావలి, మండల అధ్యక్షుడిగా షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడిగా షేక్ బషీర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌రహీం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మౌలానా అక్బర్ ఖాన్, ముఫ్తీ పోయబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

కనగల్: మండలంలోని జీ యడవల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ఖాసీంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ కేసుమలతకు వివిధ సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యదర్శి తన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపించారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని కోరిన బొమ్మకంటి మహేష్‌పై చేయి చేసుకున్నాడని ఆరోపించారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ



రవీందర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: పట్టణానికి చెందిన మాజీ జెడ్పీటీసీ శేపూరి రవీందర్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. శుక్రవారం ఆయనను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి తదితరులు ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

నాంపల్లి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల అనర్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ, పొలగోని నాగరాజు, నాంపల్లి శంకర్, మరేపాకుల శివ, నాంపల్లి శివ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోలి ప్రభాకర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న గోలి ప్రభాకర్

నల్లగొండ టూటౌన్ : శాంతి దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని మోర్డ్ ఫౌండేషన్, గోల్డెన్ ఫ్యూచర్ గోల్డెన్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోలి ప్రభాకర్‌కు సినీ నటులు రాగిని, మిట్టు ఇంటర్నేషనల్ పీస్ అవార్డును అందజేశారు. గోలి ప్రభాకర్ దివ్యాంగుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలకుగాను ఈ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో మోర్డ్ ఫౌండేషన్ చైర్మన్ డా.శ్రీనివాసరావు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- పర్యవేక్షణ మరిచిన అధికారులు
- ఇళ్లను రద్దు చేసుకుంటున్న కొందరు లబ్ధిదారులు

శాలిగౌరారం: ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం చేపట్టింది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం, లబ్ధిదారుల నిర్లక్ష్యం కారణంగా ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా శాలిగౌరారం మండలంలో తుడిమిడి గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఆతర్వాత మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశారు.

544 ఇళ్లు మంజూరు

శాలిగౌరారం మండలానికి మొదటి విడతలో భాగంగా 544 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో తుడిమిడి పైలట్ ప్రాజెక్టు గ్రామం కావడంతో ఆ గ్రామానికి 65 ఇళ్లు మంజూరు కాగా మిగిలిన 23 గ్రామపంచాయతీలకు 479 ఇళ్లు మంజూరయ్యాయి. మండల మొత్తంలో నేటివరకు 36 శాతమే ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. అందులో పైలట్ గ్రామంలో సైతం నేటికి 50 శాతం వరకే గ్రౌండింగ్ జరగడం గమనార్హం. తుడిమిడి గ్రామానికి 65 ఇళ్లు మంజూరైతే 32 ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో 33 ఇళ్లను నిర్మించలేక లబ్ధిదారులు రద్దు చేసుకున్నారు.



శాలిగౌరారంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

మార్కింగ్ 426.. గ్రౌండింగ్ 198..

శాలిగౌరారం మండలానికి 544 ఇళ్లు మంజూరు కాగా.. అందులో 426 ఇళ్లకు మాత్రమే మార్కింగ్ ఇచ్చారు. మరో 118 ఇళ్లకు మార్కింగ్ చేయలేదు. అందులో 79 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు సిద్ధంగా లేమంటూ తమ ఇళ్ల మంజూరును రద్దు చేయాలంటూ అధికారులకు లేఖ అందించారు. నేటికి మరో 39 ఇళ్లకు అధికారులు మార్కింగ్ కూడా ఇవ్వలేదు. 426 ఇళ్లకు మార్కింగ్ చేస్తే కేవలం 198 ఇళ్ల లబ్ధిదారులు మాత్రమే పనులు మొదలుపెట్టారు. అందులో 164 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉండగా.. 25 ఇళ్లు స్లాబ్ వేసే స్థాయిలో, 9 ఇళ్లు స్లాబ్ పూర్తయ్యాయి. పనులు ప్రారంభించిన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ స్థాయిని బట్టి ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలలో నిధులు జమ చేసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇళ్లను రద్దుచేసుకున్న వారి స్థానంలో తమకు ఇళ్లు మంజూరు చేయాలని నిరుపేదలు కోరుతున్నారు. అదే విధంగా అర్హత ఉన్నవారిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కోరుతున్నారు.

ఇల్లు మంజూరు చేయాలి



శాలిగౌరారంలో నాకున్న పురాతన పెంకుటిల్లు కూలిపోయింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్నా. ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. రెండో విడతలో అయినా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

– బందారు వెంకన్న, శాలిగౌరారం

ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తున్నాం



శాలిగౌరారం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నాం. లబ్ధిదారులను ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి. ఇళ్ళ నిర్మాణంలో కొంతమంది లబ్ధిదారులు ఆలస్యం చేస్తున్నారు. అన్ని ఇళ్ల నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షణ చేస్తాం.

– జ్యోతిలక్ష్మి, ఎంపీడీఓ, శాలిగౌరారం

మౌలిక వసతుల కల్పనకు కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: మున్సిపాలిటీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. చిట్యాల మున్సిపాలిటీలో పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన మూడు 110 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. వార్డుల్లో అవసరాల మేరకు సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణాలు చేపడుతామన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తిచేసి అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో చిట్యాల ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, వనమా వెంకటేశ్వర్లు, మారగోని ఆంజనేయులు, ఎద్దులపురి కృష్ణ, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, కోనేటి ఎల్లయ్య, శిలివేరు మౌనిక శేఖర్, సాగర్ల గోవర్ధన్, పోకల అశోక్, దేశపాక రాజేష్, దామనూరి అశోక్ పాల్గొన్నారు.



చిట్యాల : మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

- స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న అమిత్‌కుమార్‌రెడ్డి

చిట్యాల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో శుక్రవారం వివిధ పార్టీల నాయకులు అమిత్‌కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి భవిష్యత్‌లో దశల వారీగా పదవుల్లో అవకాశాలు కల్పిస్తామన్నారు. గ్రామానికి చెందిన కోనేటి ఎల్లయ్య, కోనేటి నర్సింహ, కోనేటి నాగయ్య, జన్నపాల బక్కయ్య, పకాల లింగయ్య, రొయ్య గోపాల్, సుంకరబోయిన నాగయ్య, కోనేటి లింగస్వామి, సింగపంగా నర్సింహల తోపాటు మరికొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, మాజీ ఎంపీటీసీ పొలగోని స్వామి, నాయకులు పల్లపు బుద్ధుడు, మాజీ ఉపసర్పంచ్ ఉయ్యాల లింగయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పట్ల జనార్దన్, జన్నపాల శ్రీను, పాకాల దినేష్, కురుపటి లింగయ్య, ఉయ్యాల మల్లేష్, మేడబోయిన శ్రీను, వస్కుల శంకర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం, చిట్యాల మండలాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన రూపుమాపవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్జ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, తిరిపారి వెంకటేశ్వర్లు, బచ్చగోని గాలయ్య, బి.లాలు, సురిగి చలపతి, చాపల శ్రీను, గోసుకొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

22న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలు

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 20న జరగనున్న భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, సలీవోజు సైదాచారి, అవుట రవీందర్‌లు కోరారు. మహాసభలను జయప్రదం చేయాలని శుక్రవారం పట్టణంలోని రామగిరి అడ్డా, డీఈఓ కార్యాలయం, గడియారం సెంటర్లలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సాగర్ల మల్లయ్య, బైరోజు ఆంజనేయులు, పి.లింగస్వామి, కొండేటి అంజయ్య, వెంకటరెడ్డి, నోముల యాదయ్య, భీమనపల్లి శంకర్, నాగరాజు, రాములు, వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఐ శిక్షణ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో మాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాలుగు రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకు ముందు ఐడియాథాన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అక్టోబర్ చివరివారంలో జరగబోయే ఐడియాథాన్ కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులకు టాస్క్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరాఖ్య, ప్రిన్సిపాల్ డా.ఎస్.ఉపేందర్ వివరించారు. కార్యక్రమంలో టీఎస్‌కెసీ కోఆర్డినేటర్, ఐడియాథాన్ కన్వీనర్ డాక్టర్ ఎం.అనిల్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డా.మునుస్వామి,డా.బి.అనిల్‌కుమార్, ఎస్.పీ.వెంకట్ రమణ, తౌసీఫ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు



నకిరేకల్ : బహుమతులు అందజేస్తున్న మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్లు మంజుల, రజిత

నకిరేకల్ : పట్టణంలోని మినీ స్టేడియం ఆవరణలో రెండు రోజుల నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి పాఠశాలల బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు శుక్రవారం రాత్రి ముగిశాయి. గెలుపొందిన జట్లకు నకిరేకల్ మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు గుత్తా మంజుల మాధవరెడ్డి, చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఈఓలు మేక నాగయ్య, అంజయ్య, రాజేంద్రప్రసాద్, స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ విమల, క్రీడల కన్వీనర్ నంద్యాల రాజశేఖర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు బండారు రామస్వామి, బ్రహ్మయ్య, విద్యాసాగర్‌రెడ్డి, చింతకాయల పుల్లయ్య, శంభులింగారెడ్డి, రాపోలు శైలజ, శ్రీదేవి, జానకి, కరీం, శ్రీనివాస్, మాణిక్యం, ధర్మేందర్‌రెడ్డి, చైతన్యకుమార్, హరితలక్ష్మీ, సరిత, మల్లేశం, నిమ్మల శంకర్‌గౌడ్ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం : ప్రథమ బహుమతితో మోడల్ స్కూల్ కబడ్డీ క్రీడాకారిణులు, పీడీ మల్లేష్

కబడ్డీలో శాలిగౌరారం మోడల్ స్కూల్ జట్టుకు ప్రథమస్థానం

శాలిగౌరారం: నకిరేకల్ పట్టణంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో శాలిగౌరారరం మండలం వల్లాలోని మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. బాలికల అండర్–17 విభాగంలో ఫైనల్‌లో కేతేపల్లి జట్టుపై శాలిగౌరారం మండల మోడల్‌స్కూల్ విద్యార్థులు విజయం సాధించి ప్రథమ స్థానం సాధించారు. అదేవిధంగా బాలుర విభాగంలో అండర్–17, అండర్–14లలో ద్వితీయస్థానంలో నిలిచారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



నల్లగొండ టూటౌన్ : మొక్క నాటి నీళ్లు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్



తిప్పర్తి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎంపీడీఓ

నల్లగొండ: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ సువీన్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నల్లగొండలోని ఎఫ్‌సీఐ కార్యాలయం నుంచి ఎఫ్‌సీఐ ఉద్యోగులు ప్రారంభించిన స్వచ్ఛత ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ర్యాలీ ఎఫ్‌సీఐ కార్యాలయం నుంచి క్లాక్ టవర్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం డాక్టర్ రాఘవేంద్ర సింగ్, సిబ్బంది కె.ఎస్.కె ప్రసాద్, బిల్లా శ్రీనివాసరావు, సజిత్, రాము, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

నల్లగొండ టూటౌన్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని నీలగిరి మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో గల వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ తమవంతు బాధ్యతగా ఇంటి పరసరాల్లో మొక్కలు నాటు పెంచి పెద్ద చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గడ్డం శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలి

తిప్పర్తి : ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించి పర్యావరణాన్ని కాపాడాలని తిప్పర్తి ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండల విద్యాధికారి నర్సింహ నాయక్, పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత తీర్చాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాంపల్లి: ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎరువుల కొరత తీర్చాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాంపల్లి మండల కేంద్రంలో అగ్రోస్ రైతు సేవా కేంద్రం గోదాం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన రైతుల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎరువుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే రైతులను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నక్కనబోయిన నరసింహ, బండి రవి, వెంకటయ్య, నల్లపు నాగరాజు, మేకల చంద్రయ్య, దండిగా వీరయ్య, ఆకులపల్లి వెంకటయ్య, సైదమ్మ, రాములమ్మ, ఎల్లమ్మ, అలివేలు, నాగరాజు, పరమేష్, వేలాద్రి శ్రీను పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

చండూరు : మునుగోడు నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలను ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి నాగమల్లేశ్వర్‌రావు, తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ మల్లేశం శుక్రవారం చండూరులో ప్రారంభించారు. చండూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగే ఈ క్రీడల్లో చండూరు, మునుగోడు, మర్రిగూడ, నాంపల్లి, గట్టుప్పల్ మండలాల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నట్లు ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కబడ్డి, ఖోఖో, వాలీబాల్ సీనియర్, జూనియర్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చండూరు జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి వాసుదేవరావు, కన్వీనర్ చిన్నజంగయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ సుధాకర్‌రెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి : గ్రామాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ కందాల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాసనగోడు, బొప్పారం గ్రామాలకు చెందిన 70 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ కోసం 15 మందిని గుర్తించి సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సూర్యచంద్రరావు, కోశాధికారి అండెం వెంకన్న, ప్రతినిధులు నారాయణరెడ్డి, తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, దుస్సా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తిప్పర్తి: మండల కేంద్రంలో తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 181 మంది ఈ శిబిరానికి హాజరై వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు ఈ శిబిరంలో బీపీ, డయాబెటిస్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రాకేష్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



కేతేపల్లి : కాసనగోడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మోడల్ స్కూల్‌కు ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు

కనగల్: కనగల్ గ్రామంలోని అక్కినేపల్లి వెంకటేశ్వరరావు మెమోరియల్ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరైంది. శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ థామసయ్యకు ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి పసుపుల ఉత్తర్వుల కాపీ అందజేశారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

మర్రిగూడ : పెట్రోల్ బంకుల్లో తప్పనిసరిగా మౌలిక సదుపాయాలు ఉండాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో వాహనాలకు ఎయిర్ ఉచితంగా నింపడం లేదని, తాగునీరు కూడా ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు.

భజన మండలి సేవాసమితి సభ్యుల ప్రమాణ స్వీకారం

రామగిరి(నల్లగొండ): రాజన్ గురుస్వామి భజన మండలి, సేవా సమితి కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అధ్యక్షులు కలిశన్ అశోక్ గురుస్వామి, కంజర శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో జరిగింది. అనంతరం విశ్వన్‌సాయి హాస్పిటల్ ఎండీ డాక్టర్ సందీప్, రామగిరి అయ్యప్ప గుడి ప్రధాన అర్చకులు డెహర శివకుమార్‌శర్మ, బ్రహ్మంగారి గుట్ట హరిగురు భవాని, మేడం విశ్వప్రసాద్, హనుమాన్ మొదటి మాలదారుడు మాడెశెట్టి వెంకటయ్య సమక్షంలో భజన మండలి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లి కార్జున్, ప్రధాన కార్యదర్శి కంజర శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురకారపు యాదగిరి గౌడ్, సహాయ కార్యదర్శి ఈద సంజీవ, కోశాధికారి టంగుటూరి నరేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పాలకూరి నర్సింహ, జాయింట్ సెక్రటరీ యలిజాల శంకర్, కార్యదర్శులు పెరిక సుశీల్, కొండేటి శంకర్, రమేష్, వేముల హరి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భక్తులకు అల్పాహారం పంపిణీ

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజి వద్దగల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తులకు శుక్రవారం న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ అధ్యక్షురాలు కంబాల శివలీలారెడ్డి అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో బచ్చగోని కిరణ్, మనీషా, సహస్ర, జక్కల శివమ్మ, ఇంద్రాణి పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన

కనగల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చండూర్ సీఐ కె.ఆదిరెడ్డి అన్నారు. శుక్రవారం కనగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాలు, మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. షీటీం, పనితీరు పోక్స్ వంటి మహిళా చట్టాలను వివరించారు. సమావేశంలో కనగల్ ఎస్ఐ కే.రాజీవ్‌రెడ్డి, పోలీసులు నిమ్మ బేబీ, షాలిని, రవీందర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చండూరు సీఐ ఆదిరెడ్డి

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన రాపర్తి నాగలక్ష్మి కుటుంబ సభ్యులకు నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం రూ.25,200 ఆర్థికసాయం అందజేశారు. నాగలక్ష్మి అయిటిపాముల గ్రామంలో 10 రోజుల క్రితం మేకలు మేపుకుంటూ నీడ కోసం ట్రాక్టర్ కింద పడుకుంది. గమనించని డ్రైవర్ ట్రాక్టర్ స్టార్ట్ చేసి నాగలక్ష్మి మీదుగా వెళ్లడంతో నడుం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలికి ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. నాగలక్ష్మి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యానికి డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బ్రహ్మదేవర నరేష్ బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. గుండు విక్రమ్, అనిల్, హరిప్రసాద్, ఉపేందర్, గోపగోని పరమేష్, మారయ్య, సైదులు, మధు, అంతయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

నల్లగొండ: పట్టణంలోని ఎస్‌సీడీడీ బాలికల ఏబీసీడీ హాస్టల్‌లో శుక్రవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను అందంగా అలంకరించారు. బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఆడిపాడారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓఎస్ విజయలక్ష్మి, స్వప్న, సత్యవతి, దూసరి భారతమ్మ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మునుగోడు: పేద విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదగోని నరేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మునుగోడులో విలేకర్లతో మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. సర్టిఫికెట్లు లేకపోవడంతో విద్యార్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని అన్నారు.